







AKSHARA TODAY

అక్షర టుడే

TOWARDS... TRUTH, TRUST, TREND

www.aksharatoday.in


## ప్రజావాణికి అధికారులు ప్రాధాన్యతనివ్వాలి




**అక్షరటుడే, ఇందూరు:** ప్రజావాణి ఫిర్యాదులను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 146 ఫిర్యాదులు అందాయి. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఫిర్యాదుదారులు తమ సమస్యలను కలెక్టర్‌తో పాటు, అదనపు కలెక్టర్లు కిరణ్ కుమార్, భుజంగరావు, డీఆర్‌వో గీత, జెడ్పీ సీఈవో సాయాగౌడ్, నిజామాబాద్ ఏసీపీ ప్రకాశ్‌లకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.


8-6-2026 NIZAMABAD / KAMAREDDY PAGES - 2


## ప్రజల భాగస్వామ్యంతోనే సత్వర ప్రగతి: కలెక్టర్ ఇలా త్రిపాఠి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ :** ప్రజల భాగస్వామ్యంతోనే సత్వర ప్రగతి సాధ్యమవుతుందని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా నగరంలోని 41వ డివిజన్ వసంత్ నగర్‌లో శ్రమదానం నిర్వహించారు. కలెక్టర్‌తో పాటు మేయర్ ఉమారాణి, డిప్యూటి మేయర్ సల్మా తహసీన్, కమిషనర్ దిలీప్ కుమార్ స్థానికులతో కలిసి పాల్గొన్నారు. మున్సిపల్ పరిధిలోని ఖాళీ స్థలాన్ని శ్రమదానంతో శుభ్రం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని గుర్తు చేశారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళికలో శ్రమదానం అంశం లేనప్పటికీ, పరిసరాల పరిశుభ్రతలో ప్రజలను భాగస్వాములు చేయాలనే లక్ష్యంతో నగరంలో ప్రత్యేకంగా శ్రమదానం కారక్రమాన్ని చేపట్టడం జరిగిందన్నారు. రానున్న వర్షాకాలంను దృష్టిలో పెట్టుకుని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వ్యక్తిగత, పరిసరాల శుభ్రతపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని సూచించారు. ఖాళీ స్థలాలు కబ్జాకు గురి కాకుండా కాపాడుకోవాలని, తద్వారా ఆ స్థలాలను స్థానిక ప్రజల అవసరాలకు అనుగుణంగా పార్కులు, వాకింగ్ ట్రాక్ తదితర వాటి కోసం వినియోగించుకునేలా తీర్చిదిద్దవచ్చన్నారు. కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ పూజిత, స్థానిక ప్రజలు, మున్సిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




## తెయూ అధ్యాపకురాలు మృతి పట్ల సంతాపం

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ విశ్వవిద్యాలయ న్యాయ విభాగంలో పనిచేస్తున్న ఒప్పంద అధ్యాపకురాలు ఎం.నాగజ్యోతి గుండె పోటుతో మరణించారు. సోమవారం కళాశాలలో అధ్యాపకులు, ఉద్యోగులు ఆమె చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. రిజిస్ట్రార్ ఆచార్య యాదగిరి మాట్లాడుతూ.. నాగజ్యోతి 15 ఏళ్లకు పైగా అంకితభావంతో సేవలందించి విద్యార్థులకు ఉత్తమ బోధనలిందించారన్నారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాళ్లు ప్రసన్న రాణి, రాంబాబు, ఆరతి, బోధన, బోధనేతర ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విధుల్లో ఉండగా గుండెపోటు.. హెడ్ కానిస్టేబుల్ మృతి

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** విధుల్లో ఉండగా గుండెపోటు రావడంతో ఓ హెడ్ కానిస్టేబుల్ మృతి చెందాడు. ఈ ఘటన నగరంలో సోమవారం చోటుచేసుకుంది. మోపాల్ మండలంలోని పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న హెడ్ కానిస్టేబుల్ గంగాధర్ సోమవారం నగరంలో విధులు నిర్వహిస్తున్నాడు. అయితే ఆయనకు అకస్మాత్తుగా గుండె నొప్పి రావడంతో గమనించిన ఎస్సై, తోటి సిబ్బంది ఆయనను హుటాహుటిన స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విధుల్లో ఉండగానే హెడ్ కానిస్టేబుల్ మృతి చెందడంతో శాఖలో విషాద ఛాయలు అనుముకున్నాయి. అనంతరం ఆయన మృతదేహాన్ని జీజీహెచ్‌కు తరలించారు. హెడ్ కానిస్టేబుల్ మృతి వార్త తెలుసుకున్న కుటుంబీకుల రోదనలు మిన్నంటాయి.

**ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన 'వడ్డీ లేని రుణాలు' అనుకున్న సమయానికి మహిళల పొదుపు ఖాతాల్లో జమకావడం లేదు. ప్రభుత్వం నుంచి రుణమాఫీ నిధులు అందడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. దీంతో మహిళలు ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నారు. వెంటనే విడుదల చేయాలని వారు కోరుతున్నారు.**

**- అక్షరటుడే, గాంధారి**



# మహిళలకు 'వడ్డీ'గోస

- తొమ్మిది నెలలుగా అందని 'వడ్డీ లేని రుణాల' సబ్సిడీ
- వడ్డీ కట్టుడేమో 'బారేడు'.. వచ్చేదేమో 'మూరేడు'
- గాంధారిలో పొదుపు మహిళల తిప్పలు..

జిల్లా పరిధిలో 17,724 మహిళా సంఘాలు ఉండగా 202526కు గాను 9,829 మహిళా సంఘాలు పావలా వడ్డీ రుణాలు తీసుకున్నాయి. దీనికి సంబంధించి రూ.10.92 కోట్ల పావల వడ్డీ చెక్కులను సైతం అధికారులు అందజేశారు. గాంధారి మండల కేంద్ర పరిధిలోని 45 గ్రామ పంచాయతీల్లో దాదాపు 514కు పైగా డ్వాక్రా మహిళా సంఘాలు ఉన్నాయి. ప్రభుత్వం సబ్సిడీ సొమ్మును సకాలంలో విడుదల చేయకపోవడంతో ఈ సంఘాల మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

### అదనపు భారం.. నిరీక్షణే దిక్కు..

ఉదాహరణకు.. గాంధారి మండలంలో ఒక డ్వాక్రా గ్రూప్‌లోని సభ్యులు రూ.1,50,000 చొప్పున అప్పు తీసుకున్నారు. వారు వడ్డీతో కలిపి 30 నెలల కాలంలో రూ.1,80,000 చెల్లించాల్సి ఉంటుంది. అంటే గ్రూప్‌లోని 10 మంది మహిళలు కలిసి దాదాపు రూ.3 లక్షల వరకు అదనంగా బ్యాంకుకు కడుతున్నారు. తాము చెల్లించిన ఈ రూ.3లక్షల వడ్డీ డబ్బులు తిరిగి ఎప్పుడు వస్తాయో తెలియక మహిళలు అయోమయంలో పడ్డారు. గతంలో (2025 సెప్టెంబర్, అక్టోబర్, నవంబర్) మూడు నెలలకు కలిపి కేవలం రూ.13,180 మాత్రమే వడ్డీ జమ అయిందని, మరి మొత్తం రూ.3 లక్షలు తిరిగి జమ కావడానికి ఇంకెన్ని రోజులు పడుతుందోనని మహిళలు ప్రశ్నిస్తున్నారు.

### 9 నెలలుగా పత్తాలేని పొదుపు పైసలు

2024 డిసెంబర్ నుండి 2025 మార్చి వరకు కేవలం నాలుగు నెలల వడ్డీని మాత్రమే ప్రభుత్వం చెల్లించింది. ఆ తర్వాత 2025 ఏప్రిల్ నుండి డిసెంబర్ వరకు (9 నెలలుగా) వడ్డీ లేని రుణాల సబ్సిడీ జాడ కరువైంది. దీంతో తాము కట్టిన మిత్తి పైసల కోసం మహిళా సంఘాలు బ్యాంకుల చుట్టూ తిరగాల్సి వస్తోంది. అయితే బ్యాంక్ అధికారులు మాత్రం బ్యాంక్‌లో జమ అయినప్పుడే చూసుకుని రావాలని పేర్కొంటున్నారు.

### ఖాతాల్లోనే డబ్బులు జమవుతాయి..

డ్వాక్రా మహిళలు గ్రూప్ తీర్మానం ప్రకారం రూ.50వేల నుంచి రూ.లక్ష వరకు రుణం తీసుకుంటారు. దీనికి అసలుతో పాటు వడ్డీ కూడా వర్తిస్తుంది. ప్రభుత్వం నుంచి రుణమాఫీ (సబ్సిడీ) సొమ్ము వస్తేనే మహిళలకు లబ్ధి చేకూరుతుంది. లేదంటే ఆ వడ్డీ భారం మహిళలపైనే పడుతుంది. ప్రభుత్వం నుంచి నగదు విడుదలైన వెంటనే నేరుగా సంఘాల పొదుపు ఖాతాల్లోనే జమవుతుంది.

**– మల్లేశ్వరరావు, తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్**

### ప్రభుత్వం భరిస్తుంది.. కానీ ఆలస్యమవుతోంది..

గాంధారి మండల పరిధిలోని 514 సంఘాలకు గత 9 నెలలుగా వడ్డీ లేని రుణాల సొమ్ము అందాల్సి ఉంది. గత ఎన్నికల సమయంలో 4 నెలల వడ్డీ చెక్కులను స్థానిక ఎమ్మెల్యే చేతుల మీదుగా అందించడం జరిగింది. వడ్డీ పైసలు కచ్చితంగా వస్తాయి. కానీ ప్రభుత్వం నుంచి విడుదల కావడానికి కొంత సమయం పడుతుంది. నిధుల లభ్యత ఆధారంగా ప్రభుత్వం 3, 4 విడతల్లో రూ.13 వేల నుంచి రూ.14 వేల వరకు గ్రూపుల ఖాతాల్లో జమ చేస్తోంది.

**– ప్రసన్నకుమార్, ఐకేపీ ఏపీఎం**

### వడ్డీ మాఫీ డబ్బులు అందుతాయి..

కామారెడ్డి జిల్లా పరిధిలో 17,724 మహిళా సంఘాలు ఉండగా 2025-26కు గాను 9,829 మహిళా సంఘాలు పావలా వడ్డీ రుణాలు తీసుకున్నాయి. అయితే ఆ రుణాలకు సంబంధించిన వడ్డీ జమ కావాల్సి ఉంది. కొన్నిచోట్ల మూడు నెలలకు ఒకసారి లేదా ఆర్నెళ్లకు ఒకసారి లేదా ఏడాదిలోగా తప్పనిసరిగా ప్రతిఒక్క డ్వాక్రా సంఘానికి మిత్తి అందజేయడం జరుగుతుంది. కొద్దిగా వెనక ముందు అయినా తప్పనిసరిగా డబ్బులు వస్తాయి.

**– రాజయ్య, డీపీఎం**

## రైతుల అవసరాలకు సరిపడా ఎరువుల నిల్వలు

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లాలో ఖరీఫ్ సీజన్ పంటల సాగు కోసం రైతుల అవసరాలకు సరిపడా యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళనకు గురి కావాల్సిన అవసరం లేదని కలెక్టర్ ఇలా త్రిపాఠి భరోసా కల్పించారు. జిల్లాలో ఎక్కడ కూడా యూరియా కొరత లేదని, రాష్ట్రంలోని ఇతర అన్ని జిల్లాల కంటే జిల్లాలోనే అత్యధిక స్థాయిలో 27,203 మెట్రిక్ టన్నుల యూరియా నిల్వలు అందుబాటులో ఉన్నాయని సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అన్ని ప్రాంతాల్లో రైతులకు ఎరువులు పంపిణీ జరిగేలా ప్రణాళికాబద్ధంగా వ్యవహరిస్తున్నామని, పంట సాగు చేసే ప్రతి రైతుకు ఎరువులు అందేలా చూస్తామని అన్నారు. ఎలాంటి అక్రమాలకు తావు లేకుండా, ఎరువులు పక్కదారి పట్టకుండా పారదర్శకమైన పంపిణీ కోసం యూరియా బుకింగ్ యాప్ దోహదపడుతోందని అన్నారు. ఈ యాప్ పనితీరును గమనించిన ఇతర రాష్ట్రాలు కూడా ఒక్క యూరియానే కాకుండా మిగతా అన్ని ఎరువులను కూడా బుకింగ్ యాప్ ద్వారానే రైతులకు అందిస్తున్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ యాప్ ద్వారా ఆయా మండలాల్లో ఏ డీలర్ వద్ద యూరియా అందుబాటులో ఉంది అనే సమచారం తెలుసుకునే వెసులుబాటు ఉందని, రైతులు సమీప డీలర్ల వద్ద పంట సాగు విస్తీర్ణానికి అనుగుణంగా అవసరమైన యూరియాను బుక్ చేసుకోవచ్చని సూచించారు. అంతేకాకుండా ప్రతీ సొసైటీ వద్ద, ప్రతీ డీలర్ షాప్‌లో ఎరువుల నిల్వల వివరాలను తెలియజేసేలా స్టాక్ బోర్డులు ప్రదర్శించేలా చర్యలు తీసుకున్నామని అన్నారు. నకిలీ, నాసిరకం ఎరువులు, విత్తనాలకు ఆస్కారం లేకుండా మండల స్పెషల్ ఆఫీసర్లతో పాటు తహశీల్దార్లు, ఇతర అధికారులతో నిరంతరం తనిఖీలు జరిపిస్తున్నామని కలెక్టర్ తెలిపారు.



## జీజీహెచ్ సూపరింటెండెంట్ నాగమోహన్ బదిలీ

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా జనరల్ ఆస్పత్రి ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ నాగమోహన్ బదిలీ అయ్యారు. ఈ మేరకు ఆయనను బదిలీ చేస్తూ డీఎంఈ నుంచి ఆదివారం అర్ధరాత్రి ఉత్తర్వులు అందాయి. నగరంలోని మెడికల్ కళాశాలలో ఫోరెన్సిడ్ డిపార్ట్‌మెంట్ ప్రొఫెసర్‌గా ఉన్న నాగమోహన్‌కు ప్రభుత్వం కొన్ని రోజుల క్రితం జీజీహెచ్ ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్‌గా అదనపు బాధ్యతలు అప్పజెప్పింది. ఈ సందర్భంగా ఆస్పత్రిని గాడిన పెట్టేందుకు ప్రణాళికతో ఆయన ముందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో ఆయనను ఆకస్మికంగా గాంధీ మెడికల్ కళాశాల ఫోరెన్సిక్ మెడిసిన్ ప్రొఫెసర్‌గా బదిలీ చేస్తూ డీఎంఈ ఆదేశాలు జారీ చేసింది.




## పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలని రాస్తారోకో..

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** పెంచిన ఎరువుల ధరలు తగ్గించాలని రైతులు, నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ ప్రజాపంథా అనుబంధ అఖిలభారత ఐక్య రైతు సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట ధర్నాకు దిగారు. ఈ మేరకు అఖిల భారత ఐక్య వైద్య సంఘం (ఏఐయుకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు ప్రభాకర్, కార్యదర్శి దేవారం మాట్లాడుతూ.. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులకు లోబడి ఎంఎస్‌పీ గ్యారెంటీ చట్టాన్ని పార్లమెంట్‌లో ఆమోదించాలని డిమాండ్ చేశారు. భారత్ అమెరికా వాణిజ్య ఒప్పందంలో భాగంగా ఎగుమతి సుంకాలను పెంచి దిగుమతి సుంకాలను పూర్తిగా రద్దు చేయడంతో దేశ వ్యవసాయ రంగం సంక్షోభానికి గురవుతుందన్నారు. మొక్కజొన్న, పత్తి, పప్పు దినుసులు, డైరీ ఉత్పత్తుల రైతులు తీవ్రంగా నష్టపోతారని వివరించారు. ఎరువుల ధరలు విపరీతంగా పెంచడంతో రైతన్న నడ్డి విరుగుతోందని.. వెంటనే కేంద్ర ప్రభుత్వం ధరలను తగ్గించాలని వారు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇలా త్రిపాఠికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఏఐయూకేఎస్ జిల్లా అధ్యక్షుడు సురేష్, ప్రధాన కార్యదర్శి బాబన్న, ఉపాధ్యక్షుడు రాజన్న, ఏపీ గంగారాం, సహాయ కార్యదర్శులు దామోదర్, కిషన్, నాయకులు సాయిలు, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

## బ్రెయిన్ ట్యూమర్‌ను ప్రారంభ దశలో గుర్తిస్తే చికిత్స సాధ్యమే..

**అక్షరటుడే, ఇందూరు:** బ్రెయిన్ ట్యూమర్‌ను ముందస్తుగా గుర్తిస్తే చికిత్స సాధ్యమేనని మెడికవర్ ఆస్పత్రి న్యూరో సర్జన్ శ్రీకృష్ణాదిత్య పేర్కొన్నారు. సోమవారం ప్రపంచ బ్రెయిన్ ట్యూమర్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బ్రెయిన్ ట్యూమర్ చికిత్స, విధానాలను వివరించారు. న్యూరో సర్జన్ శ్రీకృష్ణాదిత్య మాట్లాడుతూ.. బ్రెయిన్ ట్యూమర్ అనేది మెదడులో అసాధారణంగా కణాలు పెరగడంతో ఏర్పడుతుందన్నారు. మెదడు కణతులపై ప్రజల్లో అవగాహన పెంపొందించడం, ముందస్తు నిర్ధారణను తెలుసుకుంటే చికిత్స సులభమవుతుందని ఆయన వివరించారు. తరచూ తలనొప్పి రావడం, వాంతులు, మూర్ఛ, చూపు మందగించడం, శరీర భాగాల్లో బలహీనత, నడకలో తడబాటు, జ్ఞాపకశక్తి తగ్గడం, ప్రవర్తనలో మార్పులు వంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయొద్దన్నారు. ఈ లక్షణాలు బ్రెయిన్ ట్యూమర్‌కు సంకేతాలు కావచ్చని పేర్కొన్నారు. బ్రెయిన్ ట్యూమర్‌ను ప్రారంభ దశలోనే గుర్తిస్తే చికిత్స ఫలితాలు మెరుగ్గా ఉంటాయని, ఆధునిక వైద్య సాంకేతికతతో ఎంఆర్ఐ, సీటీ స్కాన్‌ల ద్వారా కచ్చితమైన నిర్ధారణ సాధ్యమవుతుందన్నారు. ప్రస్తుతం మైక్రోసర్జరీ, న్యూరో నావిగేషన్, ఎండోస్కోపిక్, మినిమల్లీ ఇన్వేసివ్ పద్ధతుల ద్వారా మెదడు కణితులను సురక్షితంగా తొలగించే అవకాశం ఉందన్నారు. అవసరాన్ని బట్టి రేడియేషన్ థెరపీ, కీమోథెరపీ వంటి చికిత్సలను కూడా అందిస్తున్నామని వివరించారు. ప్రజలు తలనొప్పిని సాధారణ సమస్యగా తీసుకుని నిర్లక్ష్యం చేయకుండా, లక్షణాలు కొనసాగితే వెంటనే న్యూరో వైద్యులను సంప్రదించాలని ఆయన సూచించారు. నిజామాబాద్ మెడికవర్ హాస్పిటల్స్‌లో ఆధునిక న్యూరోసర్జరీ సేవలు, అత్యాధునిక నిర్ధారణ సదుపాయాలు, నిపుణుల వైద్య బృందంతో బ్రెయిన్ ట్యూమర్ చికిత్సలు అందుబాటులో ఉన్నాయని వివరించారు.



## 10న బాన్సువాడకు మంత్రి ఉత్తమ్‌కుమార్

**అక్షరటుడే, బాన్సువాడ:** బాన్సువాడకు ఈ నెల 10న మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి రానున్నారని ప్రభుత్వ వ్యవసాయ సలహాదారు, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. వర్ని మండలం జాకోర, చందూర్ ఎత్తిపోతల పథకాల ప్రారంభోత్సవంతో పాటు సిద్ధాపూర్ రిజర్వాయర్ నిర్మాణ పనుల పరిశీలనకు ఆయన వస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాట్లను పోచారం మంగళవారం పరిశీలించారు. సుమారు రూ.106 కోట్ల వ్యయంతో నిర్మించిన జాకోర, చందూర్ ఎత్తిపోతల పథకాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయడానికి చేపడుతున్న ఏర్పాట్లపై ఆయన అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో ప్రజలు హాజరయ్యే అవకాశం ఉన్నందున అన్ని వసతులను సమకూర్చాలని ఆదేశించారు. ఈ సందర్భంగా హెలిప్యాడ్ స్థలాన్ని, సభా ప్రాంగణాన్ని పరిశీలించి.. భద్రత, ట్రాఫిక్ నియంత్రణ, తాగునీరు, పారిశుధ్యం, పార్కింగ్ తదితర ఏర్పాట్లను సమీక్షించారు. మంత్రి పర్యటన షెడ్యూల్‌కు అనుగుణంగా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఆగ్రోస్ ఛైర్మన్ కాసుల బాలరాజు, వర్ని, చందూర్ మండలాల ప్రజాప్రతినిధులు, నాయకులు, అధికారులు పాల్గొన్నారు.





## ఈవీఎం గోడౌన్‌ను పరిశీలించిన కలెక్టర్

**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** జిల్లా కేంద్రంలోని వినాయకనగర్‌లో ఉన్న ఈవీఎం గోడౌన్‌ను కలెక్టర్ ఇలా త్రిపాఠి సోమవారం అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్‌తో కలిసి పరిశీలించారు. గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈవీఎం గోడౌన్ సీల్‌ను తెరిచారు. ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఎన్నికల సామగ్రిని భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేసేలా చూడాలని, ఈవీఎంలు, బ్యాలెట్ యూనిట్లు, ఇతర సామాగ్రికి ఎలాంటి నష్టం వాటిల్లకుండా జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు బాలరాజ్, సిబ్బంది సాత్విక్, విజయేందర్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, అధికారులు ఉన్నారు.



## బంగారం దుకాణాల్లో తనిఖీలు చేయాలి

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** జిల్లాలోని బంగారు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించాలని వినియోగదారుల మండలి జాతీయ ప్రధాన కార్యదర్శి సాంబరాజు చక్రపాణి, జిల్లా వినియోగదారుల సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి సందు ప్రవీణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు లీగల్ మెట్రాలజీ ఇన్‌స్పెక్టర్ సందీప్‌కు సోమవారం వినతి పత్రం అందజేశారు. బంగారు ఆభరణాల నాణ్యతను తనిఖీ చేసేందుకు లీగల్ మెట్రాలజీ శాఖకు అన్ని అధికారాలు ఉన్నాయని సంఘం ప్రతినిధులు పేర్కొన్నారు. నిజామాబాద్ జిల్లాలోని కార్పొరేట్ బంగారు నగల వ్యాపారస్తులు నాణ్యతకు సంబంధించిన హెచ్‌యూఐడీ నెంబర్‌ను రాయకుండా, నాణ్యతతో సంబంధించిన పూర్తి వివరాలు తెలపకుండా గోప్యంగా ఉంచుతున్నారన్నారు. వినియోగదారులను తప్పుదోవ పట్టిస్తున్న క్రమంలో ఆ షాపులలో అమ్మకం జరుగుతున్న ఆభరణాల నాణ్యత ప్రమాణాలను లీగల్ మెట్రాలజి శాఖ తప్పనిసరిగా తనిఖీ నిర్వహించాలని వారు డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ఉపాధ్యక్షుడు వీఎన్ వర్మ, సంయుక్త కార్యదర్శులు మహాదేవుని శ్రీనివాస్, యాటకర్ల దేవేష్ తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో చేర్పించాలని ప్రచారం...

**అక్షరటుడే, ఆర్మూర్:** ఆర్మూర్ ప్రభుత్వ బాయ్స్ జూనియర్ కళాశాలలో అడ్మిషన్ల నిమిత్తం అధ్యాపకులు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. పట్టణంలోని గాంధీనగర్, గోవింద్ పేట్ గ్రామాల్లో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. కళాశాల ప్రిన్సిపాల్ సుభాష్ మాట్లాడుతూ.. విద్యార్థులు తమకు నచ్చిన గ్రూపులలో చేరాలని సూచించారు. కళాశాలలో ఉచిత హాస్టల్ వసతి, ఉచిత విద్య, పాఠ్య పుస్తకాలు అందిస్తామన్నారు. అలాగే ఆధునాతన డిజిటల్ తరగతులు, ఎన్ఎస్ఎస్, స్కౌట్ సౌకర్యాలు, విశాలమైన క్రీడా ప్రాంగణం, యోగా తరగతులు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు చంద్రశేఖర్, నరేష్, గంగాధర్, చంద్రమోహన్, లక్ష్మణ్, శ్రీనివాస్, రామకృష్ణ, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.



## అగ్నివీర్‌కు ఎంపికైన విజ్ఞాన్ హైస్కూల్ విద్యార్థులు

**అక్షరటుడే, గాంధారి:** మండల కేంద్రంలోని విజ్ఞాన్ హైస్కూల్‌లో చదువుతున్న నలుగురు విద్యార్థులు ఆకాష్, భీమ్‌రావు, శ్రీకాంత్, జైపాల్ అగ్నివీర్‌లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ మేరకు సోమవారం పాఠశాల యాజమాన్యం వారిని ఘనంగా సన్మానించింది. అనంతరం ప్రిన్సిపల్ విఠల్ మాట్లాడుతూ అగ్నివీర్‌కు విద్యార్థులు ఎంపికవ్వడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంజీవ్, రవిశంకర్, భూమిరెడ్డి, కవిత, అంకిత, శిల్ప, ఉమ తదితరులు పాల్గొన్నారు.




**వాహన కాలుష్య పరీక్షల పేరుతో నిజామాబాద్ జిల్లాలో దోపిడీ జరుగుతోంది. ప్రభుత్వం నిర్ణయించిన రేట్లను పక్కనపెట్టి ఇష్టారాజ్యంగా వసూలు చేస్తుండడంతో వాహనదారులు లబోదిబోమంటున్నారు. పరీక్షలు చేయకుండానే సర్టిఫికెట్లు ఇవ్వడం, బిల్లులు అడిగితే స్పందించకపోవడం వారికి పరిపాటిగా మారింది.**

**– అక్షరటుడే, ఆర్మూర్**

# పొల్యూషన్ సెంటర్ల దోపిడీ

■ నిజామాబాద్‌లో టెస్టింగ్ సెంటర్ల దందా ■ అధిక వసూళ్లతో వాహనదారుల జేబులకు చిల్లు ■ జిల్లావ్యాప్తంగా 28 సెంటర్లు

నిజామాబాద్ జిల్లావ్యాప్తంగా రవాణా శాఖ లెక్కల ప్రకారం 28 పొల్యూషన్ టెస్టింగ్ సెంటర్లున్నాయి. నిజామాబాద్ నగరంలో 12, ఆర్మూర్‌లో 4, బోధన్‌లో 3, బాల్కొండ, మెండోరా, డిచ్‌పల్లి, నందిపేట్, వర్ని తదితర మండల కేంద్రాల్లో సెంటర్లు కొనసాగుతున్నాయి. అయితే వీటిపై ఆర్టీఏ, కాలుష్య నియంత్రణ మండలి అధికారుల పర్యవేక్షణ కరువైంది. గత 8 నెలలుగా ఒక్క తనిఖీ కూడా జరగలేదని సమాచారం.

### రూ.60కి బదులు రూ.200..

నిబంధనల ప్రకారం బైక్‌కు రూ.60, కారుకు రూ.100, డీజిల్ వాహనాలకు రూ.110 మాత్రమే తీసుకోవాలి. కానీ జిల్లాలోని చాలా సెంటర్లలో రూ.150 నుంచి రూ.300 వరకు వసూలు చేస్తున్నారు. 'పరీక్ష చేయకుండా ఫొటో తీసి రూ.200 తీసుకుంటున్నారు. బిల్లు అడిగితే ఇవ్వడం లేదని పలువురు వాపోయారు.

నిజామాబాద్ ఖలీల్‌వాడి, బోధన్ రోడ్డు, ఆర్మూర్ ప్రాంతాల్లోని కొన్ని సెంటర్లలో వాహనం తీసుకురాకుండా, కేవలం వాహనం ఫొటో వాట్సాప్ చేసి, ఆర్‌సీ జిరాక్స్ ఇస్తే చాలు రూ.250కి పీయూసీ ఇచ్చేస్తున్నారు. ఇవి ఆన్‌లైన్‌లో కనిపించకపోవడంతో తనిఖీల్లో పట్టుబడి వాహనదారులు రూ.1000 జరిమానా కట్టాల్సి వస్తోంది.

### ట్రాఫిక్ పోలీసుల భయాన్ని అడ్డంపెట్టుకొని..

పొల్యూషన్ సర్టిఫికెట్ లేకపోతే రూ.1,000 ఫైన్ కట్టాల్సి వస్తుంది. ఇదే అదునుగా పోలీసుల తనిఖీలు ఎక్కువగా జరిగే సోమవారం, నెలాఖరు రోజుల్లో సెంటర్ నిర్వాహకులు ఇష్టారాజ్యగా దోచుకుంటున్నారు. ప్రతి సెంటర్‌లో ప్రభుత్వ రేట్ల పట్టిక, లైసెన్స్ డిస్‌ప్లే చేయాలి. పరీక్ష చేసే విధానం, మిషనరీ సరిగా ఉందా అని ఆర్టీఏ ఏడాదికి రెండుసార్లు తనిఖీ చేయాలి. కానీ సిబ్బంది కొరత కారణంగా తనిఖీలు లేవని అధికారులు చెబుతున్నారు. అక్రమ వసూళ్లపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని అధికారులు చెప్పుకొస్తున్నారు. అన్ని సెంటర్లలో డిజిటల్ పేమెంట్, సీసీ కెమెరాలు తప్పనిసరి చేయాలి. అక్రమాలకు పాల్పడే వారి లైసెన్స్‌లు రద్దు చేయాలని వాహనదారుల డిమాండ్ చేస్తున్నారు.

**వాహనాల వారీగా ఛార్జీలు**

| | |
|---|---|
| బైక్ / స్కూటర్ టూ-వీలర్: | రూ.50 నుంచి రూ.100 వరకు |
| పెట్రోల్ కార్లు : | రూ.75 నుంచి రూ.100 వరకు |
| డీజిల్ కార్లు : | రూ.100 నుంచి రూ.150 వరకు |
| వాణిజ్య వాహనాలు: | రూ.100 నుంచి రూ.200 వరకు |



## నగరంలో చేపమందు పంపిణీ

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** జిల్లాలో మృగశిరకార్తెను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా నగరంలోని పెద్ద బజార్‌లో చిన్నారులకు చేపమందు పంపిణీ చేశారు. బోధన్ రోడ్డులో పాత థియేటర్ పక్కన షాప్‌లో ఎండీ హైమద్ చేపమందు పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. దగ్గు, దమ్ము పక్షవాతం ఉన్న వారికి ఈ చేపమందు ద్వారా ఉపశమనం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. తాము సుమారు 40ఏళ్లుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రం నుంచే కాకుండా గ్రామాల నుంచి సైతం ప్రజలు ఈ చేపమందు కోసం తరలివచ్చారు.



## ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలి

**అక్షరటుడే, ముప్కాల్:** ప్రభుత్వ పథకాలు ప్రతి ఒక్కరికీ అందేలా చూడాలని సర్పంచ్ దాసరి గంగాధర్ సూచించారు. నాగంపేట్‌లో ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక ముగింపు గ్రామసభను నిర్వహించారు. గ్రామాభివృద్ధి, ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు, ప్రజా సమస్యలపై సమావేశంలో చర్చించారు. సభలో వివిధ శాఖల అధికారులు తమ శాఖలకు సంబంధించిన ప్రభుత్వ పథకాలు, సేవలు.. అమలు విధానాలపై ప్రజలకు వివరించారు. గ్రామ ప్రజలు సైతం తమ అభిప్రాయాలను వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ పంతంగి మదన్ కుమార్, ఎంపీడీవో రమేష్, వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి మంచిర్యాల కవిత, వివిధ శాఖల అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బిల్లులు చెల్లించకుంటే బిల్డింగ్ కాంట్రాక్టర్లు బతికేదెలా..



**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** రాష్ట్రంలో తమ పరిస్థితి అధ్వానంగా మారిందని.. చేసిన పనులకు బిల్లులు రాక ఇబ్బందుల్లో ఉన్నామని బిల్డింగ్ కాంట్రాక్టర్లు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మేరకు నగరంలో బిల్డర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో కాంట్రాక్టర్ల పరిస్థితి దారుణంగా ఉందన్నారు. పదేళ్ల నుంచి కాంట్రాక్టర్లకు ప్రజాప్రతినిధులు అపాయింట్‌మెంట్లు కూడా ఇవ్వడం లేదని వాపోయారు. కాంట్రాక్టర్లకు పేమెంట్లు రావడం లేదని.. ఇచ్చినా సీరియల్ ప్రకారం ఇవ్వడం లేదని పేర్కొన్నారు. పద్ధతి ప్రకారం బిల్లులు ఇవ్వాల్సి ఉండగా అధికారులు, ప్రజాప్రతినిధులకు నచ్చిన వాళ్లకే బిల్లులు మంజూరు చేస్తున్నారని వివరించారు. బిల్లుల కోసం పదేళ్లుగా ఎదురుచూస్తున్నామని.. ఇకపై బడ్జెట్ లేకపోయినా కాంట్రాక్టులు ఇచ్చి పనులు చేయించవద్దని వారు విన్నవించారు. ఆర్థికంగా ప్రభుత్వం వద్ద డబ్బులు లేకున్నా పనులు చేయించి కాంట్రాక్టర్లను రోడ్డున పడేయవద్దని వారు స్పష్టం చేశారు. బిల్లులు రాకపోవడంతో ఎంతోమంది కాంట్రాక్టర్లు ఆత్మహత్య చేసుకున్నారన్నారు. కాంట్రాక్టర్ల సమస్య పరిష్కారం కోసం 18న 'ఛలో హైదరాబాద్' కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఆయన తెలిపారు.

## పోలీస్ ప్రజావాణిలో ఫిర్యాదులను పరిష్కరించాలి



**అక్షరటుడే, నిజామాబాద్ సిటీ:** పోలీస్ ప్రజావాణిలో ఫిర్యాదులను చట్టపరంగా పరిష్కరించాలని అదనపు డీసీపీ (అడ్మిన్) శుభం ప్రకాశ్ అన్నారు. సీపీ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణిలో ఫిర్యాదులు స్వీకరించారు. సీపీ సాయిచైతన్య సెలవులో ఉన్నందున పోలీస్ ప్రజావాణిలో ఫిర్యాదులను అదనపు డీసీసీ స్వీకరించారు. ఈ సందర్భంగా 13 మంది బాధితుల నుంచి ఫిర్యాదులు తీసుకున్నారు. అనంతరం ఆయన సంబంధిత సమస్యలపై నేరుగా ఆయా పోలీస్‌స్టేషన్ల అధికారులతో మాట్లాడారు. చట్టపరంగా పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ప్రజలు నిర్భయంగా, మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా ఎలాంటి, పైరవీలు లేకుండా స్వచ్ఛందంగా పోలీసు సేవల్ని వినియోగించుకోవాలన్నారు. పోలీసులు ప్రజలకు మరింత దగ్గరయ్యేలా, శాంతి భద్రతలు పరిరక్షిస్తూ ముందుకు సాగడమే లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని చెప్పారు.

## తెయూలో 9 నుంచి ఇంటిగ్రేటెడ్ పరీక్షలు

**అక్షరటుడే, తెయూ క్యాంపస్:** తెలంగాణ యూనివర్సిటీలో ఈనెల 9వ తేదీ నుంచి ఇంటిగ్రేటెడ్ కోర్సుల ఆరో సెమిస్టర్ రెగ్యులర్ పరీక్షలు ప్రారంభమవుతాయని కంట్రోలర్ ఆచార్య సంపత్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పరీక్షలు ఈనెల 15వ తేదీతో ముగుస్తాయన్నారు. పూర్తివివరాలు తెలంగాణ యూనివర్సిటీ వెబ్ సైట్‌లో పొందుపర్చామన్నారు.

## ప్లాస్టిక్ రహిత భీమ్‌గల్ కోసం ప్రతిఒక్కరూ కృషి చేయాలి




**అక్షరటుడే, భీమ్‌గల్:** పురపాలక సంఘం ఆధ్వర్యంలో చేపట్టిన 'ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక'లో భాగంగా సోమవారం పట్టణంలోని 7, 9, 11 వార్డుల్లో ప్రత్యేక వార్డు సభలు నిర్వహించారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బోదిరే నాగమణి స్వామి అధ్యక్షతన జరిగిన సమావేశాల్లో మున్సిపల్ కమిషనర్ డి.గజానంద్ పాల్గొని, ప్రభుత్వ లక్ష్యాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ.. ప్లాస్టిక్ వాడకం వల్ల క్యాన్సర్ వంటి ప్రాణాంతక వ్యాధులు వస్తున్నాయని, వీటిని నివారించేందుకు ప్రతిఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలన్నారు. ఫంక్షన్లు, శుభకార్యాల్లో ప్లాస్టిక్ ప్లేట్ల స్థానంలో స్టీలు పాత్రలను వాడాలని సూచించారు. పట్టణ ప్రజల సౌకర్యార్థం త్వరలోనే మున్సిపాలిటీకి నూతన వాహనాలు కొనుగోలు చేయనున్నట్లు ప్రకటించారు. నూతనంగా ఇళ్లు నిర్మించుకునే వారు తప్పనిసరిగా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో వైస్ ఛైర్‌పర్సన్ సంటి లత నర్సయ్య, కౌన్సిలర్లు అంజుమ్ అలీ, నీలం రవి, సంగ్యా నాయక్, ఎస్సై తిరుపతి, వివిధ శాఖల అధికారులు, మహిళా సంఘాల సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాలలో పాఠ్యపుస్తకాల పంపిణీ



**అక్షరటుడే, గాంధారి:** మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరంలో అడ్మిషన్లు పొందిన విద్యార్థులకు పుస్తకాలు ఉచితంగా అందజేశారు. సోమవారం కళాశాల ప్రిన్సిపాల్ గడ్డం గంగారాం కార్యక్రమం నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం కళాశాలల్లో విద్యార్థుల సంక్షేమం కోసం అందిస్తున్న సౌకర్యాలను వివరించారు. విద్యార్థులకు ఉచిత మధ్యాహ్న భోజనం, ఉచిత పాఠ్యపుస్తకాలు, స్కాలర్‌షిప్‌లు, వైద్య సదుపాయాలు తదితర సంక్షేమ పథకాలను ప్రభుత్వం అందిస్తోందని తెలిపారు. ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు విద్యలో రాణించాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజగోపాల్, లక్ష్మణ్, ఎల్ శ్రీధర్, విజయకుమార్, రమేష్, వెంకటస్వామి, సరిత, సంభాజి తదితరులు పాల్గొన్నారు.

## బిగాల గణేష్ క్షేమం కోసం ప్రత్యేక పూజలు, అన్నదానం

**అక్షరటుడే, నిజామాబాద్ అర్బన్:** నిజామాబాద్ అర్బన్ మాజీ ఎమ్మెల్యే గణేష్ బిగాల ఆరోగ్యంగా ఉండాలని నగర బీఆర్ఎస్ నాయకులు ఆకాంక్షిచారు. ఈ సందర్భంగా నగరంలోని నీలకంఠేశ్వరాలయం, మాక్లూర్‌లోని విఠలేశ్వరాలయంలో ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. అనంతరం నీలకంఠేశ్వర ఆలయంలో మధ్యాహ్నం అన్నదానం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. కారు ప్రమాదం నుంచి గణేష్ బిగాల సురక్షితంగా బయటపడడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో నుడా మాజీ ఛైర్మన్ ప్రభాకర్ రెడ్డి, సుజిత్ సింగ్, గాండ్ల లింగం, రమేష్, మాకు రావు, చింతకాయల రాజు, శివకుమార్, విఠల్, మధు, న్యాలం రమేష్, సన్నీ, మహేష్, నరేష్ గౌడ్, జింక, రాజు, నరేష్ పాల్గొన్నారు.

